www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 9 ఫిబ్రవరి 2024

బాల నేరస్తులకు న్యాయం చేస్తాం

ప్రజాశక్తి - కడప

బాల నేరస్తులను గుర్తించి వారికి న్యాయ సహాయం అందించడమే పాన్ ఇండియా 2024 ప్రచారం ముఖ్య ఉద్దేశమని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. గురువారం సబ్‌జైలును సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైళ్లలో ఉన్న బాల నేరస్తులను గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడం ఈ ప్రచార ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ పాన్ ఇండియా ప్రచారం -2024 కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కడప, ప్రొద్దుటూరు, రాయచోటి, రాజంపేట, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల, కమలాపురం జైళ్లలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పులివెందుల సబ్ జైలు సూపరింటెండెంట్, పానెల్ న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యసభకు 'మేడా'!

- 27న నామినేషన్‌కు కసరత్తు?
- వైసిపి కేడర్‌లో ఉత్సాహం

ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రఘునాథరెడ్డి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/రాజంపేట అర్బన్

రాజంపేట ఎమ్మెల్యే సోదరుడు, ప్రముఖ కాంట్రాక్టర్ మేడా రఘునాథరెడ్డికి రాజ్యసభ సభ్యత్వం లభించింది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం రాష్ట్రానికి దక్కిన మూడు రాజ్యసభ అభ్యర్థిత్వాల పేర్లను ఖరారు చేశారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సోదరుడైన రఘునాథరెడ్డి పేరు పోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 27న నామినేషన్ దాఖలు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రాజంపేట నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యే మేడా అభిమానులు, వైసిపి కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అభ్యర్థిత్వాల కోసం చేపట్టిన సర్వేల్లో వెనుకబడిన నేపథ్యంలో సమన్వయకర్తత్వాన్ని నిరాకరించారు. ఎమ్మెల్యే మేడా స్థానంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిని నియమించారు. ఇద్దరి నాయకుల మధ్య విభేదాలు, గ్రూపులు తలెత్తే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి తన సొంత జిల్లాలో అధికార వైసిపి పట్టు సడలకుండా చేయడంలో భాగంగా వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే కుటుంబానికి రాజ్యసభ సభ్యత్వాన్ని ప్రతిపాదించినట్లు సమాచారం. ఎమ్మెల్యే మేడా కుటుంబీకులు, ఆకేపాటి అమరనాథరెడ్డితో సమిష్టిగా పనిచేసి ఎమ్మెల్యేగా గెలిపించుకుని రావాలని ఆదేశించినట్లు సమాచారం. ఆర్థికపరమైన ఖర్చులు దగ్గర నుంచి అసమ్మతుల సమస్యలను సమిష్టిగా పంచుకుని గెలుపే ధ్యేయంగా పని చేసే బాధ్యతల్ని అప్పగించినట్లు సమాచారం. ఇందుకు అనుగుణంగానే క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఆకేపాటి అమరనాథరెడ్డి సమిష్టిగా ప్రచారాన్ని సైతం నిర్వహిస్తున్నట్లు ప్రచారం సాగుతుండడం గమనార్హం.

సిఎంను కలిసిన మేడా రఘునాథరెడ్డి

ప్రముఖ పారిశ్రామికవేత్త మేడా రఘునాథరెడ్డి గురువారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. వైసిపి అధిష్టానం తనను రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. జగన్ తనపై ఉంచిన నమ్మకం వమ్ము చేయకుండా పార్టీకి సేవ చేస్తామన్నారని తెలిపారు.

ఉద్రిక్తత

- టిడిపి, వైసిపి నాయకుల మధ్య ఘర్షణ
- వైసిపి కార్పొరేటర్ కుమారుడికి గాయాలు
- టూటౌన్ పోలీసుస్టేషన్ ఎదుట వైసిపి నేతల నిరసన
- బాధ్యులపై చర్యలు తీసుకుంటాం : డిఎస్‌పి

కడప నగరంలో గురువారం ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. టిడిపి, వైసిపి నాయకుల మధ్య నెలకొన్న ఘర్షణ చిలికిచిలికి గాలివానల మారి దాడులు చేసుకునే స్థాయికి చేరుకుంది. ఈ సంఘటనలో వైసిపి కార్పొరేట్ కుమారుడికి గాయాలయ్యాయి. దీంతో వైసిపి నేతలు టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలియజేశారు. వివరాలు..

టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న వైసిపి నాయకులు

ఘర్షణలో గాయపడిన పీరుల్లా

ప్రజాశక్తి-కడప

సోషల్ మీడియాలో పోస్టింగుల విషయంలో 39వ డివిజన్ కార్పొరేటర్ కమల్ కుమారులు, టిడిపి బూత్ ఇన్‌ఛార్జి ఆరిఫ్ మధ్య గురువారం ఘర్షణ చోటు చేసుకుంది. కమల్ పెద్ద కుమారుడు షేక్ పీరుల్లాపై ఆరిఫ్ మరికొంతమందితో కలిసి కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటనలో పీరుల్లా తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు బాధితుడిని హుటాహుటిన చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న వైసిపి కార్పొరేటర్లు, నాయకులు మధ్యాహ్నం కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. పీరుల్లాపై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులరెడ్డి, డిప్యూటీ సిఎం తమ్ముడు అహ్మద్‌బాషా పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విషయంపై ఆరా తీసేందుకు శ్రీనివాసులరెడ్డి పోలీసులతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. ఈనేపథ్యంలో వైసిపి నాయకులు టిడిపికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అహ్మద్‌బాషా మాట్లాడుతూ కడప ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. నగరంలోని 31వ డివిజన్‌లో ఫ్లెక్సీలకు సంబంధించిన వ్యవహారంలో స్థానికంగా వివేషాలను రెచ్చగొట్టి వారిలో భయ భ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేటర్ కుమారుడు పీరుల్లాపై కత్తితో దాడి చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం మేయర్ సురేష్‌బాబు, వైసిపి యువ నాయకులు అహ్మద్‌బాషా, మరికొందరు నాయకులు కలిసి బాధితుడిని రిమ్స్‌కు వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం : డిఎస్‌పి

కడప టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 39వ డివిజన్‌లో పీరుల్లా పై ఆరిఫ్ అనే వ్యక్తి, మరికొందరు కత్తితో దాడికి పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చిందని, సంఘటనపై సమగ్రంగా విచారించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి షరీఫ్ పేర్కొన్నారు. కాగా సంఘటన జరిగిన సమయంలో టిడిపి నాయకులు కొందరు పోలీస్ స్టేషన్ వద్దకు రాగా వైసిపి నాయకులు, కార్పొరేటర్లు చేరుకున్నారు. పోలీస్ స్టేషన్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించామని చెప్పారు.

16న నిరసనను జయప్రదం చేయండి

- వామపక్ష కార్మిక, రైతు, వ్యవసాయ సంఘాల నాయకులు పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

కార్మికులు, కర్షకుల హక్కులను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని సాగనంపాలని, ఈనెల 16న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జిల్లా వ్యాప్తంగా జయప్రదం చేయాలని వామపక్ష కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు జి.చంద్రశేఖర్, నాగ సుబ్బారెడ్డి, మనోహర్, దస్తగిరి రెడ్డి, అన్వేష్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పరచకుండా కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని చెప్పారు. ఒకవైపున పెట్రోల్, డీజిల్, గ్యాస్, ధరలను విపరీతంగా పెంచేసి ప్రజల నెత్తిన భారాలు వేయడమే కాక, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. అందులో భాగంగానే దేశ సంపదను అంబానీ, అదాని వంటి కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా దోచిపెడుతుందని విమర్శించారు. నరేంద్ర మోడీ పరిపాలనలో కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు కల్పించిన నరేంద్ర మోడీ రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మికుల హక్కులను కాల రాశారని మండిపడ్డారు. అదానీ అంబానీలను కుబేరులను చేసి, రైతులను, వ్యవసాయ కార్మికులను అప్పులు పాలు చేశారని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకే మూడు నల్ల చట్టాలు తీసుకు వచ్చారన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారన్నారు. భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారని అన్నారు. నిరంకుశ పరిపాలన సాగిస్తున్న కేంద్ర బిజెపి, నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. బిజెపి ప్రభుత్వాన్ని గద్దించేందుకు అన్ని వర్గాల ప్రజలు ఏకం అవ్వాలన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు అన్ని పంటలకు 50 శాతం ప్రకారం మద్దతు ధరల చట్టం చేయాలని, కేరళ రాష్ట్ర విధానాన్ని అమలు చేయాలని అన్నారు. రైతుల రుణాలు మాఫీ చేసేందుకు రుణ ఉపశమన చట్టాన్ని చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. ఉపాధి కూలీలకు 200 పని దినాలు పెంచి, వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్ మస్టర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కరువు తుపాన్ నష్టపరిహారాలను ఇన్‌పుట్ సబ్సిడీలను రైతులకు వెంటనే ఇవ్వాలని చెప్పారు. రైతులందరికీ పంటల బీమా కల్పించాలని కోరారు. 16న జరిగే దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె గ్రామీణ ప్రాంత బంద్ జయప్రదం కోసం జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు సదస్సులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, మెడికల్ రిప్రజెంటివ్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు రెడ్డి, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి, ఎల్ఐసి యూనియన్ డివిజన్ కార్యదర్శి రఘునాథరెడ్డి, అవధానం శ్రీనివాసులు, ఏఐటీయూసీ కమలాపురం ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్, మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు సుంకర రవి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు సంసిద్ధం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల సంసిద్ధతతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి రెవెన్యూ, మూడవ దశ రీసర్వే, ఇనామ్ అండ్ అసైన్డ్ భూములు, పీఆర్ అండ్ ఆర్డీ, ఎన్ఆర్ఈజిఎస్, జల్ జీవన్ మిషన్, పేదలందరికీ ఇళ్లు - పట్టాలు - రిజిస్ట్రేషన్, వైద్యఆరోగ్యం అండ్ కుటుంబ సంక్షేమం, ఎన్నికల సన్నద్ధత, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమావేశానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జెసి గణేష్ కుమార్, డిఆర్ఓ గంగాధర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష పాల్గొన్నారు. సిఎస్ వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలను జిల్లాలో సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాలను మరోసారి తనిఖీ చేసి వసతులను సమకూర్చాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సాధారణ భద్రతా ఏర్పాట్లు, సదుపాయాలు సరిగా లేని చోట్ల వెంటనే సంసిద్ధం చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువగా తీసుకెళ్లేందుకు ఆయా శాఖల ద్వారా అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి, హౌసింగ్, డ్వామా పీడీలు కృష్ణయ్య, యదుభూషన్ రెడ్డి, పిఆర్ ఎస్ఇ శ్రీనివాసులు రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ వీరన్న, డిప్యూటీ డిఎంహెచ్ఒ ఉమామహేశ్వర కుమార్, ఆరోగ్యశ్రీ డిసి బాలాంజనేయులు, డిసిహెచ్ఎస్ హిమదేవి, రెవెన్యూ, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహాధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు

వేతనాలు వెంటనే చెల్లించాలి

- విద్యుత్ జిల్లా స్ట్రగుల్ కమిటీ మహాధర్నా

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యుత్ ఉద్యోగులకు వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విద్యుత్ జిల్లా స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు విద్యుత్ భవన్ ఎదురుగా మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర చైర్మన్ పి.సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.సుబ్బి రెడ్డి, శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులు కాంట్రాక్టు కార్మికులతోనే భర్తీ చేయాలని కోరారు. ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించేందుకు వెంటనే నియామకాలు చేపట్టాలని పేర్కొన్నారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హామీ మేరకు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. డిస్కాం అధ్యక్షులు యన్.శివశంకర్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల కాంటాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం, ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు,. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నాయబ్ రసూల్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విద్యుత్ ఉద్యోగులు పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావాలని పేర్కొన్నారు. మహాధర్నాలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగ సుబ్బయ్య, శ్రీహరి, మైదుకూరు డివిజన్ నాయకులు రామ్మోహన్, నాగమల్లయ్య, రాజంపేట డివిజన్ నాయకులు ఇరికల్ రెడ్డి, డివిజన్ నాయకులు ఏ.వి.రమణ, అమర్నాథ్ రెడ్డి, సుబ్రమణ్యం రాజు, అధిక సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైవీయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కడప అర్బన్ : యోగి వేమన యూనివర్సిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ పరీక్షలను విసి ప్రొఫెసర్ చింత సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఎ, ఎంకామ్, ఎంఎస్‌సి, ఎంపిఇడి మొదటి సెమిస్టర్ పీజీ పరీక్షలు గురువారం క్యాంపస్‌లోని ఆర్ట్స్, సైన్స్ బ్లాకులలో మొదలయ్యాయి. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డితో కలసి వచ్చారు. విద్యార్థుల హాల్‌టికెట్‌లను పరిశీలించారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని విధుల్లో ఉన్నవారికి ఆదేశాలిచ్చారు.

వైవీయూలో నూతన మెస్ ప్రారంభం

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం బాలికల వసతి గృహంలో నూతన మెస్, డైనింగ్‌హాల్‌ను విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింతా సుధాకర్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. విసి స్వయంగా విద్యార్థినిలకు ఆహార పదార్థాలు వడ్డించారు. ప్రిన్సిపల్‌తో కలిసి వసతి గృహం లోనే భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 600 మంది విద్యార్థినులు వసతి గృహంలో ఉంటున్నారని, వారికి ఇప్పటికే ఒక మెస్ ఉండగా మరింత సౌకర్యార్థం 300 మంది విద్యార్థినులు కూర్చొని భోజనం చేసేలా ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థుల సౌకర్యాల కల్పనలో ఎప్పుడు ముందుంటామని తెలిపారు. అసౌకర్యాల ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. చక్కగా చదువుకుని తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారులు డా.పి.పార్వతి, డా. జి.మెర్సీ విజేత, డా.అనుప్రసన్న, డా.సుమిత్ర విశ్వవిద్యాలయ ఇంజినీరు రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

టికెట్ల కేటాయింపులో బలిజలకు ప్రాధాన్యత ఇవ్వాలి

కడప అర్బన్ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టికెట్ల కేటాయింపులో బలిజల పట్ల సామాజిక న్యాయం పాటించాలని, బలిజల ఓట్లు ఎక్కువ సంఖ్యలో ఉన్న నియోజకవర్గాల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కాపునాడు రాష్ట్ర నేత హరి రామ జోగయ్య కు జిల్లా కాపు నాయకులు విన్నవించారు. గురువారం ఆయన నివాసంలో కలిసిన కడప జిల్లా నాయకులు జిల్లాలో టికెట్ల కేటాయింపు, సామాజిక సమీకరణాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లాలో అధిక సంఖ్యలో కాపులు ఉన్నప్పటికీ మాత్రం వారి రాజకీయ ప్రాతినిధ్యం మాత్రం చాలా తక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఎన్నికల్లో బలిజలను ఓట్ల కోసం వాడుకోవడం తప్పితే సీట్లు ఇవ్వడంలో మాత్రం అన్ని రాజకీయ పార్టీలు అన్యాయంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో కడప, రాజంపేట, రైల్వే కోడూరు, రాయచోటి, బద్వేలు తదితర నియోజకవర్గాల్లో బలిజల ఓట్లు అత్యధికంగా ఉన్నాయని, కానీ ఇక్కడ మాత్రం బలిజలకు పోటీ చేసే అవకాశం రావడం లేదన్నారు. ఇప్పుడు జరుగుతున్న సామాజిక అన్యాయానికి జనసేన ద్వారా అయినా న్యాయం చేకూర్చాలని, ఆ విధంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాలని హరిరామజోగయ్యను కోరారు.

జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలియజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

'కడప ఉక్కు' కోసం నినదించిన డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

విభజన చట్టంలో రాష్ట్ర హక్కు అయిన కడప ఉక్కును కేంద్ర ప్రభుత్వం విస్మరించడాన్ని నిరసిస్తూ గురువారం దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద డివైఎఫ్ఐ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విభజన హామీ అయిన కడప ఉక్కును పూర్తిగా విస్మరించిందన్నారు. చట్టబద్ధంగా రాసుకున్న కడప ఉక్కు హామీని ఎందుకు అమలు చేయడం లేదని కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. కనీసం చివరి బడ్జెట్ సమావేశాల్లో అయిన పార్లమెంటులో కడప ఉక్కు నిధులు కేటాయిస్తారని అనుకుంటే బిజెపి ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు మరో సారి మోహానికి మసి పూసిందన్నారు. రాష్ట్ర అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి రెండు గళమెత్తకపోవడం సిగ్గుచేటు అన్నారు. యువత ఆశ కడప ఉక్కు అన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వేలల్లో లభిస్తాయని తెలిపారు. కరువు కోరల్లో ఉన్న రాయలసీమకు ఉపశమనం ఉద్యోగాల రూపంలో లభిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కడప ఉక్కు విచిత్ర పరిస్థితి అని, మూడు శిలా ఫలకాలు ముగ్గురు ముఖ్యమంత్రులు వేసిన చరిత్ర ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంటుందని చెప్పారు. వచ్చే ఎన్నికలలో ఎవరు కడప ఉక్కు పరిశ్రమ పూర్తి చేస్తామని స్పష్టమైన హామీ ఇస్తారో, కేంద్రాన్ని నిలదీసి కడప ఉక్కుకు నిధులు రాబడుతారో యువత వారికే మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. లేకుంటే ఓటు ద్వారా తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహ పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనలో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

కడప : ఆర్ట్స్ కళాశాలలో బాటనీ విభాగానికి విద్యార్థులు గురువారం యోగి వేమన యూనివర్సిటీ బొటానికల్ గార్డెన్ ను సందర్శించారు. ప్రకృతిలో విద్యను అభ్యసించడం వల్ల విద్యార్థుల మనోవికాసం అభివృద్ధి చెందుతుందని ప్రిన్సిపల్ రవీంద్రనాథ్ తెలియజేశారు. ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి బొటా నికల్ గార్డెన్‌లోని ఎన్నో అరుదైన, అంతరించిపోయే, ఆయుర్వేద మొక్కలు గురించి వివరించారు. ఇందులో భాగంగా బాటనీ విభాగాధిపతి డాక్టర్ రాజశే ఖర్ రెడ్డి, డాక్టర్ సురేష్ బాబు, శివరామకృష్ణ, డాక్టర్లు నాగేంద్ర, సునీల్, విద్యార్థులు పాల్గొన్నారు.

బడ్జెట్ అంతా అంకెల గారడీ : టిడిపి

కడప అర్బన్ : రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడి, బడ్జెట్ అంచనాలు కొండంత, ఖర్చులు ఇసుమంత అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి. హరిప్రసాద్ బడ్జెట్‌పై అసంతృప్తిని వ్యక్తం చేశారు. హరి టవర్స్ లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.13 వేల కోట్ల రెవెన్యూ లోటును, రూ.44 వేల కోట్లకు, రూ.35 వేల కోట్ల ద్రవ్య లోటును రూ.60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదేనని అన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్లో కొత్త అంశాలు ఏమీ లేవన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో, దుష్ట శక్తులు కుట్రలు పన్నుతున్నాయని, రాజకీయ పార్టీల నాయకులు ప్రశాంత ఎన్నికలకు విలువివ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాంప్రసాద్, బలిజ సంఘం నాగరాజు పాల్గొన్నారు.

జాతీయ ఫైర్ సర్వీస్ క్రీడల్లో వైఎస్ఆర్ జిల్లాకు 8 పతకాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

జాతీయ స్థాయి ఫైర్ సర్వీస్ క్రీడల్లో అత్యంత ప్రతిభ చూపి రాష్ట్రానికి 20 పతకాలు రాగా జిల్లాకు 8 వచ్చాయి. గురువారం జిల్లా అగ్నిమాపక అధికారి ఐ. ధర్మారావు జిల్లా అగ్నిమాపక అధికారులు సిబ్బందిని అభినందించారు. ఆయన నుంచి ప్రశంసలు, అభినదనలను స్వీకరించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు ఐదు రోజుల పాటు అహ్మదాబాద్ లోని గుజరాత్ యూనివర్సిటీలో జరిగిన 2వ అల్ ఇండియా ఫైర్ సర్వీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు అండ్ ఫైర్ సర్వీస్ మీట్ - 2024 ఉత్సవాలు ఘనంగా నిర్వహించారని, ఈ క్రీడోత్సవాల్లో రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖ తరపున పాల్గొన్న ఫైర్ అధికారులు, సిబ్బంది విశేష ప్రతిభ కనబర్చి 2 బంగారు పతకాలు, 6 వెండి పతకాలు, 12 కాంస్య పతకాలను సాధించడం రాష్ట్రానికే గర్వకారణం అన్నారు.

పతకాలు సాధించిన సిబ్బందిని అభినందిస్తున్న జిల్లా అగ్నిమాపకాధికారి

అభివృద్ధి పథంలో మేజర్ పంచాయతీ : సర్పంచ్

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో లేకపోయినా పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ ప్రజలకు గడిచిన మూడేళ్ల పాలనలో తన వంతు కృషి చేశానని మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ నాయుడు పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోరుమామిళ్ల మేజర్ పంచాయతీలో ప్రధాన సమస్యలైన తాగునీరు, డ్రెయినేజీ, రోడ్లు, విద్యుత్‌తో పాటు మరెన్నో ప్రజల, కార్మికుల సమస్యలు పరిష్కరించానన్నారు. ఫిబ్రవరి 9 నాటికి నేను సర్పంచ్ గా ఎన్నికైన అప్పటినుండి మూడు సంవత్సరాలు పూర్తవుతుందని నాటి నుండి నేటి వరకు పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు వెంటనే మోటార్లను రిపేరు చేయించడం కొత్త మోటార్లను వేయించడం ఏ వార్డులో తాగునీటి సమస్య లేకుండా చూశాను అన్నారు. ప్రతి వీధిలో డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజల సమస్యలను తెలిపారు. కృడ విద్యుత్ సమస్య రానివ్వలేదన్నారు. అవసరమైన చోట సిసి రోడ్లు వేయించామన్నారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైనా తన సొంత డబ్బులు ఇచ్చి వారి సమస్యల్ని పరిష్కరించామన్నారు. రాబోవు ఎన్నికల్లో 2024లో రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపడుతుందని, అప్పుడు ప్రజలకు మరింత సేవలు అందిస్తానని ఆయన పేర్కొన్నారు.

సొంత నిధులతో బోరు వేయిస్తున్న సర్పంచ్ సుధాకర్‌నాయుడు (ఫైల్‌ఫోటో)

ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు

ప్రజ్ఞా వికాస పరీక్ష విజయవంతం

ప్రజాశక్తి- కడప అర్బన్

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక గాంధీనగర్ మున్సిపల్ పాఠశాలలో నిర్వహించిన ప్రజ్ఞ వికాస మోడల్ టెస్టు పరీక్ష విజయయవంతమైంది. ముందుగా భీరం శ్రీధర్ రెడ్డి విద్యాసంస్థల అధినేత భీరం సుబ్బారెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గండి. సునీల్ కుమార్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మహేష్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో పబ్లిక్ పరీక్షలు అంటే భయం పోగొట్టేందుకు ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ప్రతి సంవత్సరం ప్రజ్ఞా వికాస్ పరీక్షలు నిర్వహిస్తూ ఉందని చెప్పారు. పరీక్ష పేపర్‌ను ప్రముఖ విద్యావేత్త కె.ఎస్ లక్ష్మణరావు తయారు చేశారని తెలిపారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల స్థాయిలో మొదటి మూడు బహుమతులు, జిల్లా స్థాయిలో టాప్ 10 ప్రోత్సాహక బహుమతులు అందజేశారని పేర్కొన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనపరచిన పేద విద్యార్థులకు భీరం విద్యాసంస్థల్లో ఉచిత విద్య అందిస్తామని భీరం సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మనోజ్, దేవకుమార్, యుటిఎఫ్ నాయకులు మేరీ పాల్గొన్నారు.

కనీస వసతుల కోసం అంబేద్కర్ విగ్రహానికి వినతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కనీస వసతులు కల్పించాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో అమృత్‌నగర్ లబ్ధిదారులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రమిచ్చారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి ర్యాలీగా పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇచ్చిన స్థలాల్లో కరెంటు, మంచినీళ్లు, ఇంటి రుణాలు, రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. దాదాపు 15 సంవత్సరాల నుంచి శాంతియుతంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదన్నారు. ఆందోళనలో లత, హసీనా, రఫీ, రమీజా, పెంచల్ రెడ్డి, చినరాయుడు, సుబ్బరాయుడు, అంజి, మధు, ముంతాజ్, హుస్సేన్‌బాషా, పార్వతి, రాములమ్మ, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న లబ్ధిదారులు

పౌష్టికాహారం పంపిణీ చేయకపోతే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రతి ఒక్కరికీ పౌష్టిక ఆహారాన్ని అందించాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని 21, 22 వార్డుల అంగన్వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని ప్రభుత్వం ఇచ్చిన మోతాదులో అందించాలన్నారు. పిల్లలకు మంచి భోజనాన్ని పెట్టాలన్నారు. పౌష్టిక ఆహారం పంపిణీ సరిగా చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్వాడీ కేంద్రంలో ఎంతమంది పిల్లలున్నారు.. ఎంత పౌష్టికాహారం ఉందనే రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు భార్గవి, కిషోర్, డేనియల్ పాల్గొన్నారు.

స్థానికులు రోడ్డుకు అడ్డుగా పెట్టిన మొద్దు, టైర్లు

భారీ వాహనాలకు నో ఎంట్రీ

టైర్లు, మొద్దు అడ్డుపెట్టిన స్థానికులు - సిఐ జోక్యంతో తొలగింపు

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు నుండి ఆర్‌టిపిపికి వెళ్లే దారిలోని కాలనీలో భారీ వాహనాలు తిరుగుతున్నాయని, వాటికి నో ఎంట్రీ అని కాలనీవాసులు రోడ్డుకు అడ్డంగా మొద్దు, టైర్లు పెట్టారు. టిప్పర్లు అధిక లోడుతో కాలనీలోని రోడ్డుపై తిరుగుతుండడంతో రోడ్డు త్వరగా పాడవుతుందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా వాహనాల రద్దీ వల్ల దుమ్ము, ధూళి విపరీతంగా ఇళ్లల్లో పేరుకుపోతోందని వాపోయారు. దుమ్ము, ధూళి ధాటికి తట్టుకోలేక పోతున్నామని, వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు రోడ్డుపైకి రావాలంటే హడలెత్తి పోతున్నామని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. పులివెందులలోని ఓ మైన్స్ నుండి వెలికి తీసిన ఓ పౌడర్ టిప్పర్లలో ముద్దనూరు రైల్వేస్టేషన్‌కు తరలిస్తున్నారు. దీని వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. టిప్పర్ల రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో సిఐ దస్తగిరి ప్రజలతో మాట్లాడి రోడ్డుకు అడ్డుగా వేసిన మొద్దు, టైర్లు తొలగించారు.

జగన్ పాలన అంతా బాదుడే : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

వైఎస్ జగన్ రెడ్డి పాలనలో అంతా బాదుడే అని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జలగ మనుషుల రక్తం పీల్చినట్లు జగన్ ప్రభుత్వం పన్నులు, ధరలు, ఛార్జీలు పెంచి ప్రజల రక్తం తాగుతున్నారని తెలిపారు. ధరల మోత, పన్నుల మోత అన్న చందంగా జగన్ పాలన తయారైందన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక 56 నెలల కాలంలో రూ.1.40 లక్షల కోట్లు అదనపు భారం ప్రజలపై పడిందని విమర్శించారు. రాబోవు ఎన్నికల్లో బిజెపితో టిడిపి, జనసేన పొత్తులు పెట్టుకోవడం శోచనీయమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. పిసిసి చీఫ్ షర్మిలమ్మ భద్రత పెంచే బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. ఆమె భద్రతను 4 ప్లస్ 4కు పునరుద్ధరించాలని తులసిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

క్రైం కార్నర్

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని వి.రాజుపాలెం గ్రామంలో లోమడ లక్ష్మిదేవి (36) ఇంట్లో చీరతో ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రెడ్డి భార్య లక్ష్మిదేవికి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడేది. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కొండారెడ్డి కేసు నమోదు చేశారు. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - పోరుమామిళ్ల

పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మద్యం బాటిళ్లు తీసుకెళుతున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుండి 43 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. పక్కా సమాచారం మేరకు గురువారం సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్ట్‌షాపు నిర్వాహకుడు చిన్న ఎరసాల గ్రామానికి చెందిన కొట్టం తిరుపతయ్య వ్యక్తి నుండి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

చాపాడు : మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో 40 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీ నిర్వహించామన్నారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు.

168 బస్తాల బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మండల పరిధిలోని ఆటోనగర్‌లో గురువారం 168 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన 50కిలోల 168 బస్తాలు పట్టుబడ్డాయి. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు గోడౌన్ వద్దకు చేరుకొని గోడౌన్‌ను సీజ్ చేశారు. రూరల్ పోలీసులు గోడౌన్ వద్ద కాపలా ఉన్నారు.

సీజ్ చేసిన గోడౌన్

స్టార్టర్లు, కాపర్ వైర్లు వరుస చోరీ..

ఆర్థిక భారంతో సతమతం.. లబోదిబోమంటున్న రైతులు

చింతలమడుగుపల్లె పొలాల్లో పగులగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్, కాపర్ తీసుకెళ్లగా మిగిలిన వస్తువులు

ప్రజాశక్తి - వేంపల్లె

పంటలకు సాగు నీరు అందించేందుకు వ్యవసాయ భూముల్లో సాగు నీటి కోసం మోటర్లుకు అమర్చిన స్టార్టర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్లును చోరీకి గురవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో అదనపు భారం పడుతోందని రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని చింతల మడుగుపల్లె, కుమ్మరాంపల్లె, అలిరెడ్డిపల్లెతోపాటు ఆయా గ్రామాల్లో వ్యవసాయ భూముల్లో ఉన్న స్టార్లర్లు, వైర్లు కొద్ది రోజులుగా చోరీకి గురవుతున్నాయి. దీన్ని ఎవరికి చెప్పుకోలేక రైతులు మౌనంగా ఉండి పోతున్నారు. ఇదేసాకుగా గుర్తు తెలియని వ్యక్తులు మరింత రెచ్చిపోతున్నారని రైతులు వాపోతున్నారు. బుధవారం అర్ధరాత్రి చింతల మడుగుపల్లె సమీపంలో ఉన్న రాజా సాహెబ్ భూమిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి అందులోని విలువైన రాగి తీగ, ఆయిల్ దోచుకెళ్లినట్లు బాధిత రైతు రాజా సాహెబ్ వాపోయాడు. విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు రాజా సాహెబ్ పేర్కొన్నాడు. రాగితీగ అపహరించడంతో దాదాపు రూ.50 వేలు ఖర్చు రైతులపై అదనపు భారం పడుతున్నట్లు చెప్పాడు.గతంలో కూడా విద్యుత్ స్తంభాలు చోరీకి గురయ్యాయని రైతు తెలిపాడు. ప్రతిరోజూ ఏదోక ప్రాంతంలో రాత్రి సమయంలో దుండగులు పొలాల్లోకి వెళ్లి దొంగతనానికి పాల్పడుతున్నట్లు రైతు మహమ్మద్ దర్బార్ చెప్పారు. ఇటీవల కాలంలో చింతలమడుగుపల్లె సమీపంలో తోటలను సాగు చేసిన నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, చావలి సంటెన్న, బాషా, గండు గంగయ్య అనే రైతుల స్టార్టర్లు, కెబుల్ వైర్లు దొంగలించినట్లు తెలిపారు. స్టార్టర్ విలువ రూ.10వేలు అవుతుందన్నారు. ప్రతిరోజూ ఏదోకచోట చోరీ జరుగుతుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. నిద్ర లేని రాత్రులు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు.

ప్రొద్దుటూరు వైసిపి టికెట్ ఇంకా ఖరారు కాలేదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు వైసిపి ఎమ్మెల్యే టికెట్ ఇంకా ఖారారు కాలేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అసమ్మతి గ్రూపు కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాషా, భాస్కర్ పేర్కొన్నారు. ఆ మేరకు శివచంద్రారెడ్డి గురువారం విలేకరులతో మాట్లాడుతూ అధిష్టానం ఎమ్మెల్యే టికెట్ తనకే ప్రకటించిందని ఎమ్మెల్యే రాచమల్లు తనకు తానుగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అధిష్టానం నుండి ఇంకా అధికారికంగా ఇప్పటివరకు ప్రొద్దుటూరు నియోజకవర్గానికి అభ్యర్థి పేరు ఖరారు చేయలేదన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వైసిపి అధినేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రొద్దుటూరు టికెట్ విషయమై పునరాలోచన చేసి, అవసరమైతే సర్వే నిర్వహించాలని కోరారు. ఎమ్మెల్యే రాచమల్లు మూడవసారి అభ్యర్థిగా ఈ నెల 15 నుంచి నియోజకవర్గంలో ప్రచారం మొదలు పెట్టనున్న నేపథ్యంలో.. అసమ్మతి గ్రూపు కూడా తాము త్వరలోనే ఎన్నికల ప్రచారం మొదలు పెట్టనున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ ఇర్ఫాన్ భాషా మాట్లాడుతూ వై నాట్ బిసి, వై నాట్ మైనారిటీ అనే చర్చ నియోజకవర్గంలో జరుగుతున్న సమయంలో, ఎమ్మెల్యే రాచమల్లు అధిష్టానం మరోసారి టికెట్ తనకే కేటాయించిందని వెల్లడించడం సబబు కాదన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ శివచంద్రారెడ్డి, వైసిపి నాయకులు

అధిష్టాన నిర్ణయం మేరకు అభ్యర్థులను ఖరారు చేసి ప్రకటిస్తారని గుర్తు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 60 వేల పైచిలుకు ఓట్లు మైనారిటీ ప్రజలవని, మైనారిటీ అభ్యర్థిగా తనను అధిష్టానం ప్రకటిస్తే, మైనారిటీలు తనకు సహకరిస్తే, ఇతరులను కలుపుకొని వెళ్లి వైసిపికి ప్రొద్దుటూరులో 50వేల ఓట్ల మెజారిటీ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి : ఆర్‌డిఒ

లబ్ధిదారులకు ఇంటి స్థల పత్రాలు అందజేస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్

ప్రజాశక్తి - వేంపల్లె

జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం పొందిన లబ్ధిదారులు అందరికీ ఇంటి స్థలంపై పూర్తి సర్వ హక్కులు పొందేలా చేపట్టిన రిజిస్ట్రేషన్లు ప్రక్రియను గ్రామ సచివాలయ సిబ్బంది వేగవంతంగా పూర్తి చేయాలని పులివెందుల ఆర్‌డిఒ వెంకటేష్ ఆదేశించారు. గురువారం వేంపల్లె పంచాయతీ పరిధిలోని వైస్ మదీనాపురంలో ఉన్న జగనన్న కాలనీ లబ్ధిదారులకు తహశీల్దార్ వెంకటేష్‌నాయక్‌తో కలిసి ఆర్‌డిఒ వెంకటేష్ ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. రిజిస్ట్రేషన్లు జరిగే పద్ధతిని కూడా ఆర్‌డిఒ పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నవరత్నాలు-అర్హులందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం పొందిన లబ్ధిదారులు అందరికీ ఇంటి స్థలాలను వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు చెప్పారు. వృద్ధులు, కొందరు రాలేని పరిస్థితుల్లో ఉన్న లబ్ధిదారులకు నేరుగా వారి ఇంటి వద్దకే రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ లోకేష్, విఆర్ఒ రవీంద్రారెడ్డి, భరత్, సచివాలయ కార్యదర్శి కొండయ్య, సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

హామీ నిలబెట్టుకోవాలని ఆర్‌టిపిపి కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఇచ్చిన రాష్ట్ర వ్యాపిత ఆందోళన పిలుపులో భాగంగా గురువారం ఆర్‌టిపిపిలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ జనరల్ సెక్రటరీ వెన్నపూస సుబ్బిరెడ్డి మాట్లాడుతూ ప్రతి పక్ష నాయకుడిగా ప్రజా సంకల్ప పాదయాత్రలో ఎర్రగుంట్లలో జరిగిన బహిరంగ సభలో జగన్ మాట్లాడుతూ తాను అధికారంలోకి వస్తే విద్యుత్ కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారం వచ్చి అయిదేళ్లు పూర్తవుతున్నా ఆ హామీ నెరవేరలేదన్నారు. నమ్మిన కార్మికులను మోసం చేయవద్దని ఆయన కోరారు. విద్యుత్ రంగంలో థర్డ్ పార్టీ విధానాన్ని తొలగించాలని, విద్యుత్ యాజమాన్యాలే నేరుగా కాంట్రాక్టు కార్మికులకు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో స్ట్రగుల్ కమిటీ నాయకులు వెంకటస్వామి, హరి ఓబుల్‌రెడ్డి, వి.గంగయ్య, నాగేంద్ర, డి.పుల్లారెడ్డి, జి.చంద్రశేఖర్, రమణ, రామ్‌ప్రసాద్, స్టాఫ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.శివయ్య, రాము పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు, ఉద్యోగులు

అభివృద్ధి నిరోధక బడ్జెట్ : సిపిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి వ్యతిరేకంగా ఉందని సిపిఎం పట్టణ కార్యదర్శి గోపాలదాస్ ఏసుదాసు విమర్శించారు. గురువారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర సహకారంతో మిగిలిన సమస్యలను త్వరలో పరిష్కరించబోతుందని చెప్పడం రానున్న రోజుల్లో బిజెపితో వైసిపి చట్టాపట్టాలు వేసుకొని వెళుతుందని స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఈ కారణంగానే ప్రత్యేకహోదా విషయంలోనూ రాష్ట్రానికి కీలకమైన పోలవరం నిధులు, అలాగే విశాఖ ఉక్కు, రైల్వేజోన్, కడప ఉక్కు వంటి విషయంలోనూ అదే వైఖరి అవలంభిస్తోందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు అబ్రహం, ప్రభాకర్, రాజు, రవిరావు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ఆర్థికశాఖ మంత్రి బుగ్గన బడ్జెట్ అంతా అంకెల గారడీనే అని, అందులో రాష్ట్రాభివృద్ధి ఎక్కడాలేదని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుగ్గన బడ్జెట్ అంచనాలు కొండంత అయితే ఖర్చులు పిసరంత అన్నారు. రూ.13వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44వేల కోట్లకు, రూ.35వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదే అన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమీ లేవన్నారు. ప్రస్తుతం ఎపి అప్పులు రూ.11.58 లక్షల కోట్లు అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, బూసిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుబ్బరాజా పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన దొడియం వాసులు

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం దొడియం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు మాజీ ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో కొమ్ము బాల, నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, నాగేశ్వరరావు, నూరుబాషా, డేవిడ్ ఉన్నారు.

శ్రీరాంనగర్‌లో టిడిపి నేతల పర్యటన

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : పట్టణ పరిధిలోని 37వ వార్డు శ్రీరాంనగర్‌లో గురువారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి భార్య మౌనిక, అక్క హరిత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబద్ధపు 5 హామీలతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రతి ఇంటికి తిరుగుతూ వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ.. టిడిపి మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు తెలిపారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి, వేయించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 41 వార్డు శూలం శివప్రసాద్, లక్ష్మీదేవి, 37వ వార్డు పొట్టిపాటి గంగాధర్, మాజీ కౌన్సిలర్ భాగ్యమ్మ, కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరయ్య, ద్వారకానగర్ గంగా సుధాకర్ యాదవ్, భగసింగ్ కాలనీ పట్నం మాబాషా, గోపవరం గగ్గుటూరి గౌస్ మొహిద్దీన్, ఆచార్ల కాలనీ మార్తల ప్రతాపరెడ్డి, చౌటపల్లి శివ, నరసింహులు, ఆరో వార్డు కుల వెంకటేష్, హోటల్ మధు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముద్దనూరు: టిడిపి పాలనలోనే మహిళల ఆర్థికాభివృద్ధి జరుగుతుందని టిడిపి జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్ సుబ్బరామిరెడ్డి సతీమణి చదిపిరాళ్ల జ్యోతి అన్నారు. మండలం లోని మాదన్నగారిపల్లె, కోనాపురం గ్రామాల్లో గురువారం జ్యోతి, తల్లి చదిపిరాళ్ల సరస్వతి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి వైసిపి వైఫల్యాలను ప్రజలకు వివరించారు. టిడిపి అమలు చేసే మేనిఫెస్టో గురించి తెలియజేసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యేగా భూపేష్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు శివరామిరెడ్డి, నాయకులు రమేష్ నాయుడు. కొండయ్య. రామాంజనేయులు. వెంకటస్వామి. వెంకట్రాముడు, ఆనంద్, రాముడు, లక్ష్మణుడు, వెంకటరామయ్య, చిన్న మాబు, దస్తగిరి, పీరయ్య, పెద్ద పీరయ్య, దస్తగిరి, అబ్దుల్ రజాక్, దస్తగిరి, సునీల్, సిద్దు పాల్గొన్నారు.

కడప ఉక్కు కోసం భూపేష్ పాదయాత్ర

జమ్మలమడుగు రూరల్ : కడప ఉక్కు ఫ్యాక్టరీ.. మన హక్కు పేరుతో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సి.భూపేష్‌రెడ్డి పాదయాత్రలో యువత పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి కోరారు. గురువారం సాయంత్రం నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రూట్ మ్యాప్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ పేరుతో నియోజకవర్గంలోని ప్రజలను, యువతను పెద్ద ఎత్తున మోసం చేసిందన్నారు. కడప ఉక్కు మన హక్కు అనే సంకల్పంతో శనివారం ఉదయం పాదయాత్ర చేయబోతున్నారన్నారు. అంబభవాని దేవాలయం, కూరగాయల మార్కెట్, గాంధీ బొమ్మ సర్కిల్, ట్యాంక్ వీధి, ఎత్తపువారి కాలనీ, కన్నెలూరు, గోరిగనూరు, ధర్మాపురం, దానవులపాడు, సున్నపురాళ్లపల్లె, సిరిగేపల్లె, పెద్దదండ్లూరు గ్రామం వరకు పాదయాత్ర ఉంటుందన్నారు. పెద్దదండ్లూరులో సాయంత్రం బహిరంగ సభ ఉంటుందని తెలిపారు.

ఉద్యోగాలకు జెఎన్‌టియు విద్యార్థులు ఎంపిక

పులివెందుల టౌన్ : జెఎన్‌టియు బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థులకు టాప్ అకాడమీ కంపెనీలో ఉద్యోగాలకు పదిమంది ఎంపికయ్యారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాధాకృష్ణ, అసిస్టెంట్ ట్రైనింగ్ ప్లేస్మెంట్ అధికారి సాంబయ్య విద్యార్థులను అభినందించారు.

చెక్కును పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్, ఎమ్మెల్యే రాచమల్లు

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పేదరిక నిర్మూలనే జగన్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం సిఎంఆర్ఎఫ్ చెక్కులను మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మిదేవి పంపిణీ చేశారు. షేక్ మహమ్మద్ షారుఖ్ కుటుంబ సభ్యులకు రూ.5.30లక్షల, వసంత ఓబులమ్మకు రూ.4లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సహాయపడడం తనకు అత్యంత ఇష్టమైన కార్యక్రమమన్నారు. పేదరికంతో ఎవరూ అనారోగ్యం పాలు కాకూడదన్నారు. జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడు సద్వినియోగం చేసుకొని సుఖంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు జీలాన్ సత్యం, వంశీధర్‌రెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, వైసిపి అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి జగన్ కృషి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అన్ని వర్గాల అభ్యున్నతికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని, మళ్లీ ముఖ్యమంత్రిగా ఆయననే ఎన్నుకుందామని మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. పులివెందుల మున్సిపాలిటీ స్థానిక పెద్దరంగాపురం సచివాలయ పరిధిలోని జయమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో చేయని అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో గౌరవ మున్సిపల్ చైర్మెన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజుల్లా, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, గౌరవ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. స్థానిక ముద్దనూరు రోడ్డు సమీపంలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీలోని పోలింగ్‌స్టేషను 72,73లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికలకు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సిద్ధంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

విద్యాశాఖ ఉత్తర్వులను అమలు చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

విద్యాశాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులను ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం అమలు చేయాలని ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్స్ సంఘ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు గురువారం ఓ ప్రకటనలో కోరారు. గత సంవత్సరం అక్టోబర్17న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలతో చర్చించి ఉత్తర్వులను జారీ చేశారన్నారు. జిఒఎంఎస్ వన్ మేరకు ప్రయివేట్ టీచర్లకు బ్యాంకు ఖాతాల ద్వారానే వేతనాలు చెల్లించాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. అధికారులు కాలయాపన చేస్తూ ఉంటే సంబంధిత విద్యాశాఖాధికారులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని గడ్డం రాజు తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న మదర్‌థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో గురువారం పెండ్లిమర్రి మండలం నందిమండలం గ్రామానికి చెందిన డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ దయానా వివాహ వారికోత్సవం సందర్భంగా అన్నదానం చేశారు. వృద్ధులకు అన్నదానం, స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు జయకర్, రాజా, చందు, ప్రసన్న, ప్రదీప్, మణి, వినయ్, ఆశ్రమ నిర్వాహకులు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధులకు చూపు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపువస్తుందని స్నేహిత అమృతహస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు అన్నారు. పట్టణంలోని వెలమవారిపల్లి గ్రామానికి చెందిన మాడిశెట్టి రామ్‌మోహన్ గురువారం మృతి చెందడంతో ఆయన భార్య రేణుక, కుమారుడు సంజీవ్, కుమార్తె శేషు మారుతీ నేత్రదానానికి అంగీకరించి రాజుకు సమాచారమిచ్చారు. టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతుడి ఇంటికెళ్లి పార్థివదేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కుటుంబంలోని వ్యక్తి, సన్నిహితులు, బంధువులు ఎవరు మరణించినా నేత్రదానంపై అవగాహన కల్పించి 99665 09364, 70932 04537కు సమాచారం ఇవ్వాలన్నారు.

కార్నియాలను సిబ్బందికి ఇస్తున్న కుటుంబ సభ్యులు

మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదు

పులివెందుల టౌన్ : జాతీయ రహదారుల మాసోత్సవాల్లో భాగంగా పులివెందుల ఎంవిఐ కార్యాలయంలో గురువారం ఇన్‌స్పెక్టర్ బివి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అర్బన్ సిఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ అరుణ్‌రెడ్డి ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఆటోలను నిలపరాదన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా, తాగి దారిలో వెళ్లే వ్యక్తులకు ఇబ్బందులు కలిగించేవారు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్మెంట్ కానిస్టేబుల్ మధుసూదన్ పాల్గొన్నారు.

శ్రీ రామస్వామి దేవాలయం
యస్.సి.కాలనీ, చిన్నరంగాపురం (గ్రా), పులివెందుల (మం), కడప జిల్లా

e-Procurement Tender
NIT No.P/COE/163/2024-16, Dt:25/10/2024

దేవాలయ పునఃనిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in. వెబ్‌సైట్‌ను చూడగలరు.

ఇట్లు, ధర్మకర్త

వేలం ప్రకటన

వై.యస్.ఆర్.జిల్లా, ప్రొద్దుటూరు మండలం, ప్రొద్దుటూరు టౌన్‌లో ఉన్న శ్రీ కృష్ణగీతాశ్రమముకు సంబంధించి, 4/637-ఎ, 4/641, 4/642, 4/646, 4/649, 4/650, 4/657-3, 4/680, 4/691, 6/692, 4/695, 4/696, 4/700-ఎ, 4/702, 4/704, 4/699-UP, 4/678-UP, 4/672, 4/706 అనే డోర్ నెంబర్లు గల ఇళ్ళు/రూములు/బిల్డింగ్‌లను బాడుగకు ఇవ్వడానికి గానూ, 20-02-2024 మంగళవారం మధ్యాహ్నం 2:00 గంటలకు శ్రీ కృష్ణగీతాశ్రమం నందు బహిరంగ వేలం నిర్ణయించబడును. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనాలని కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

ఇట్లు,
సి.శంకర్ బాలాజీ,
కార్యనిర్వహణాధికారి, శ్రీ కృష్ణ గీతాశ్రమం.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE : KADAPA
E.P.NO.23 OF 2023 IN O.S.NO : 11 OF 2017

S.CHANDRA MOULI, Son of S. Sankaraiah. Hindu, aged about 51 Years, Doctor by profession, residing at Door. No. 1/376-1 Yerramukka palli, Kadapa City.

- PETITIONER/D.HR

--Vs--

ABBISETTY SATYANARAYANA, Son Abbi setty Venkataramana, Hindu, aged about 54 Years, Resident of Door No.20/108, Akula Street, Kadapa City. Now Residing at Jambavanthuni Street, Madhavaram-II, Vontimitta Mandal, Kadapa Dist.

- RESPONDEN/J.DR

NOTICE TO THE RESPONDET/J.DR UNDER ORDER 21 RULE 64 C.P.C

Where as the petitioner /D.Hr herein filed the above E.P aginst you being Respondent /J.Dr for realization of E.P amount by way of sale of its E.P Shedule porperty and the said E.P Stands posted on **16.02.2024** fof your due appearance therefore you being the Respondet /J.Dr here by instructed to appear bofore the Hon'ble court on **16. 02.2024** at 10-30 A.M. Sharp personally or through an Advocate, failing which the matter will be decide as Ex-parte.

BY ORDER OF THE HON'BLE COURT

ADVOCATES FOR PETITIONER/D.HR
S.MD.KHALEEL GHOUSE &
P.ABBAS KHAN